క్లుప్తంగా

పాఠశాలల్లో పఠనోత్సవం సందడి



పాన్‌గల్: పాఠశాల విద్యా శాఖ ప్రకటించిన పఠనోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగలా నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రార్థన సమయంలోనే పుస్తక పఠనం ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా కూర్చోబెట్టి గ్రంథాలయ పుస్తకాలను, తరగతి పాఠ్యపుస్తకాలతో పఠనం చేయించారు. ఈ కార్యక్రమం జూలై 31వ తేదీ వరకు నిత్యం కొనసాగిస్తామని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌యాదవ్ ప్రకటించారు. ప్రత్యేకంగా ఇందుకోసం ఒక పిరియడ్ కేటాయిస్తామని తెలిపారు. తెలుగు, ఆంగ్ల బాషల్లో విద్యార్థులకు ధారాళంగా చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించినట్లు హెచ్ఎం పేర్కొన్నారు.

కళాకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కొల్లాపూర్: జానపద కళాకారులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ దండోరా, జానపద కళాకారుల సంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కళాకారులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలల క్రితం కళాకారులకు దళితబంధు, బీసీ కళాకారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, కళాకారులందరికీ కలిపి కళాభవన్‌ను నిర్మించి కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. ఇప్పటివరకు ఒక్క హామీ నెరవేర్చేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. జూలై 2 వతేదీ వరకు దీక్షలు కొనసాగిస్తామని అప్పటివరకు ఎమ్మెల్యే స్పందించకపోతే తదుపరి కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాములు, గోపి, నాగరాజు, నర్సింహ, రామకృష్ణ, జ్యోతి తదితరులున్నారు.

పచ్చరొట్ట ఎరువుగా జీలుగసాగు చేపట్టండి



పెద్దకొత్తపల్లి: వానాకాలంలో రైతులు వరినాట్లు వేసుకునే ముందు పచ్చరొట్ట ఎరువుగా జీలుగ సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని గోపాలనాగరాజు రైతు వ్యవసాయ పొలంలో వేసిన జీలుగ పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జీలుగ వేసుకోవడం ద్వారా నేలకు పచ్చిరొట్ట ఎరువు అందడమే కాక అధిక దిగుబడి వస్తుందన్నారు. జీలుగ విత్తనాలు చవుడు భూములతోపాటు నల్లరేగడి నేలలో వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ విత్తనాలు ఎకరాకు 10 నుంచి 12 కిలోలు ఇసుకలో కలిపి పొలంలో చల్లుకుంటే 9 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందన్నారు. జీలుగ వేసినప్పుడు వాటి వేళ్ల భూమిలోతులోకి వెళ్లడంతో అనేక పోషకాలను వెలికి తెచ్చి పంటలకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ముజీద్ పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్లు విడుదల

కోడేరు: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో హైదరాబాద్ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదిగల జనాభా 70లక్షలకు పైగా ఉందని రాష్ట్ర ఏర్పాటుకు మాదిగలు ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మహాసభ ఏర్పాటు చేస్తున్నామని మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుర్మయ్య, తిరుపతయ్య, రమేష్, బాలరాజు, బాలపీరు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ చెందిన బుగ్గన్న హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం స్థానిక రూ.లక్ష ఎల్ఓసీని కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు.

పెద్దకొత్తపల్లి: మారేడుమాందిన్నెకు చెందిన బాలస్వామికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును జెడ్పీటీసీ మేకల గౌరమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రయ్య పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు



రైతులకు విత్తనాలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తకోట రూరల్: ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ డా.కోగారే అన్నారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి రైతువేదికలో బుధవారం కేవీకే ఆధ్వర్యంలో సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యావన శాఖ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు చేయడం ద్వారా రైతులకు మూడేళ్ల తర్వాత స్థిరమైన ఆదాయం ఉంటుందని తెలిపారు. అంతవరకు ఆయిల్‌పాం మధ్యలో అంతర పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త రాజేందర్ మాట్లాడుతూ ఏడాదికి రెండు పంటలు వరి వేయడం వల్ల సారవంతమైన నేలలు సైతం కొన్నాళ్లకు చౌడు నేలలుగా మారి సాగుకు పనికి రాకుండా పోతుందన్నారు. ప్రతి సంవత్సరం పంట మార్పిడి చేయడం ద్వారా భూమి సారవంతమై అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు.

చిరు ధాన్యాలకు గిరాకీ..

రైతులందరూ వరి సాగు చేయడానికే మొగ్గు చూపుతుండడంతో చిరు ధాన్యాలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ భారీగా పెరిగిందన్నారు. ప్రస్తుత కాలంలో అందరికీ ఆరోగ్యంపై అవగాహన పెరిగి చిరు ధాన్యాలు తినడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచడానికి సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు భవానీ, సురేష్‌కుమార్, ఏఓ కుర్మయ్య, సర్పంచ్ సిద్ధయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, ఏఈఓ మధు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం తోటలకు దరఖాస్తుల ఆహ్వానం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలో ఆయిల్‌పాం తోటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ చంద్రమౌళి తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్కు, బ్యాంక్ అకౌంట్, బోరు లేదా బావి విద్యుత్ కనెక్షన్ రశీదు జిరాక్స్ పత్రాలను ఏఈఓలకు ఈ నెల 30 వరకు అందజేయాలని సూచించారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందులాల్‌పవార్

కొత్తకోట: రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందులాల్‌పవార్ వ్యాపారస్తులను హెచ్చరించారు. బుధవారం పట్టణంలో ఆయన ఆకస్మికంగా పర్యటించి మున్సిపాలిటీలో చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సదర్భంగా కొత్తకోట చౌరస్తా నుంచి హైదరాబాద్ రహదారి, వనపర్తి రహదారి, కర్నూల్ రోడ్డు, మదనాపురం రోడ్డు మీద ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించాలన్నారు. అదేవిధంగా డబ్బాలు, తోపుడు పండ్లు ఇతర ఆక్రమణలను తొలగించేందుకు స్పెషల్ ఎంక్రోచ్‌మెంట్ టీం ను నియమించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును ఆదేశించారు. అనంతరం మున్సిపల్ ఆఫీస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి బిల్ కలెక్షన్, శానిటేషన్, హరితహారం, రోడ్డు ఆక్రమణలు, ఇంటింటి చెత్త సేకరణ వంటి పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు ఉషోదయ స్కూల్ వద్ద డ్రెయినేజీ క్లీనింగ్ పనులు పర్యవేక్షించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించి, వేగవంతంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుఖేశిని, మేనేజర్ రవీందర్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన

వనపర్తి నుంచి కొత్తకోటకు వచ్చే మార్గంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం ఉదయం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి చెరువులో చేపట్టిన ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులో ఒండ్రు మట్టి తరలింపు, కాల్వల మరమ్మతు పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. దీంతో పాటు గ్రామంలో వర్షపు నీరు భూమిలోకి ఇంకే విధంగా సామూహిక ఇంకుడుగుంతలు, ఇళ్ల నుంచి వచ్చే మురుగు, మరుగుదొడ్ల నుంచి వచ్చే నీరు ఇంకేందుకు వేరు, వేరుగా ఇంకుడు గుంతలను నిర్మించుకునేలా ఇంటి యజమానులకు సూచించాలన్నారు. నిర్మాణంలో ఉన్న పంచాయతీ భవనం, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు గ్రామస్తులు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్యయాదవ్, పంచాయతీ కార్యదర్శి విజయలత పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం: తల్లి, బిడ్డ క్షేమం



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ నుంచి కాన్పు కోసం గర్భిణిని పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో అంబులెన్స్‌లో కాన్పు అయిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం శాగాపూర్‌కు చెందిన గర్భిణి మంజులకు ప్రసవం నొప్పులు వస్తుండటంతో కాన్పు కోసం అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామానికి వచ్చిన అంబులెన్స్‌లో ఆమెను తరలిస్తుండగా పాన్‌గల్ సమీపంలో అంబులెన్స్‌లో ఆడ పాపకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ శశి, ఫైలెట్ యుగంధర్ పేర్కొన్నారు. తల్లి, బిడ్డను మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చేర్పించగా వారు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

నాసిరకంగా వంతెన నిర్మాణ పనులు



కొంకన్‌వాని పల్లిలో వంతెన

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో నిర్మించిన వంతెన నాసిరకంగా నిర్మించారని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. నాసిరకంగా నిర్మించిన వంతెన పనులను మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ కొంకన్‌వానిపల్లి–మద్దూర్ గ్రామాలకు వెళ్లడానికి ఉన్న మట్టి రహదారిలో గ్రామ సమీపంలో వంపు ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యేను విన్నవించడంతో రూ.ఐదు లక్షలు వంతెన కోసం మంజూరు చేశారు. ఎనిమిది నెలల కిందట పనుల కోసం భూమిపూజ చేసిన ఎమ్మెల్యే, వాటి నిర్మాణ పనులను వేగవంతగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పిన్నంచర్ల వెంకటేష్ మూడు పైపులను వేసి వాటిపై పిట్ట గోడలను నిర్మించి మట్టితో గుంతలను పూడ్చి పనులను మమ అనిపించారని గ్రామస్తులు ఆరోపించారు. నాసిరకమైన పనులకు అదనంగా మరో రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కోరడం వింతగా ఉందన్నారు. ప్రజలకు, రైతులకు పదికాలల పాటు ఉపయోగ పడాల్సిన వంతెనను నాసిరకంగా నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, సీపీఐ నాయకులు ఆటో అంజి, కృష్ణయ్య పాల్గొన్నారు.

'సీఎం కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి'



ఆత్మకూర్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, గురువారం నిర్వహించే బీజేపీ భారీ బహిరంగసభకు వేలాదిగా తరలిరావాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్ మహేశ్వరి, నియోజకవర్గ కో కన్వీనర్ రేచింతల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు తమ్మలి విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని వార్డుల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆనంద్, కొండాపురంరాము, తమ్మలివెంకటేష్, రఘు, శేషు, భీంరెడ్డి, బాలకృష్ణ, సమద్, లక్ష్మినారాయణ, సూరి, చందు, బాలరాజు, వెంకట్రాములు, శ్యామ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జగదీష్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా మేసేజులు, సైబర్ నేరగాళ్ల నుంచి కాల్స్ వస్తే బ్యాంక్ వివరాలు ఇచ్చి మోసపోకుండా పోలీసులు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారణకు కృషి చేయాలని పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యమంలో ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'తోటి ఉపాధ్యాయులు మాట వినడం లేదు'



గోవర్ధనగిరి ఉన్నత పాఠశాలలో విచారణ చేస్తున్న అధికారులు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు పాఠశాలకు తరుచూ గైర్హాజరవుతుండడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బుధవారం ఉన్నతాధికారులు విచారణ చేసేందుకు పాఠశాలకు వెళ్లగా తోటి టీచర్లు మాట వినడం లేదని, ఇన్‌చార్జ్ హెచ్ఎం హోదా నుంచి తొలగించాలని ఇన్‌చార్జ్ హెచ్ఎం అధికారులను వేడుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు ఎన్నో రోజులుగా పాఠశాలకు సక్రమంగా రావడం లేదని ఆయన విచారణ నిమిత్తం వచ్చిన మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి ఎదుట వాపోయారు. ఉపాధ్యాయులపై వస్తున్న ఆరోపణలకు జవాబులు ఇచ్చిన ఉపాధ్యాయులు హెచ్ఎం తన సొంత పనులపై సెలవులపై వెళ్లి తిరిగి రిజిస్టర్లలో సంతకాలు చేసుకుంటున్నారని వారు సైతం ఆరోపణలు చేశారు. కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన విషయాలను వీడియోల ద్వారా చిత్రీకరించి ఇతర గ్రూపులకు షేర్ చేస్తున్నారని హెచ్ఎం అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల బాగు కోసమే వీడియోలు తీసి ఉపాధ్యాయ గ్రూపుల్లోనే షేర్ చేశానని ఒక ఉపాధ్యాయుడు సమాధానం ఇవ్వగా.. మరుగుదొడ్ల వసతులు సక్రమంగా లేనందున బైక్‌పై బయటకు వెళ్తున్నామని మరో ఉపాధ్యాయుడు సమాధానం ఇచ్చాడు. ఇరుపక్షాల ఆరోపణలను రికార్డు చేసుకున్న అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూమెంట్ రిజిస్టర్ నిర్వహణ చేయడం లేదని, స్టాఫ్ మీటింగ్ రికార్డు కూడా లేదని అన్ని విషయాలను ఉన్నతాధికారులకు వివరిస్తామని వారు తెలిపారు. గ్రామస్తుల ఎదుటే విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రతి ఆరోపణలు చేసుకోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి, కుమ్మరి వెంకటయ్య, మహబూబ్‌పాష తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: ముదిరాజ్‌లను అవమానించేలా మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తక్షణం సస్పెండ్ చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ఖిల్లాఘనపురం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు జింకల కృష్ణయ్య, కృష్ణ, పెద్దిరాజు మాట్లాడుతూ.. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తులు, ఓ వర్గం ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం సరైనది కాదన్నారు. కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసి, జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణతో ఉపాధి



కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీరం విజయమ్మ

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు మహిళా సమాఖ్య భవనంలో బీరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు నేర్పించే కేంద్రాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ నేర్పించేందుకు మాస్టర్‌ని కూడా ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో మండలం వ్యాప్తంగా ఉచిత కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, సర్పంచ్ నంది కౌసల్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదన్న యాదవ్, గోవిందు శ్రీధర్‌రెడ్డి, ఆనంద్‌యాదవ్, డేగ శేఖర్, ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో మేధోశక్తి పెరుగుతుంది



అమరచింతలో క్విజ్ పోటీలబ్రోచర్లను విడుదల చేస్తున్న నాయకులు

అమరచింత: కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లి రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీల్లో అధికంగా మహిళలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి నియోజకవర్గం మొత్తంలో 43 బహుమతులు ఇస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని సంక్షేమ పథకాలు కేవలం పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయన్నారు. పట్టణంలో ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు జరగకపోవడం ఏమిటన్నారు. కార్యక్రమంలో శ్యామ్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



కొల్లాపూర్: బక్రీద్ పర్వదినం సందర్భంగా పలువురు పేద ముస్లింలకు సురగాని శ్రీనివాస్‌గౌడ్ పంపిన సరుకులను పట్టణంలోని పలు వార్డుల్లో స్థానిక నాయకులు అందజేశారు. వేడుకల సమయంలో నిత్యావసరాలకు ఇబ్బందులు ఉండకూడదనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నయూమ్, యువకులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలు, రోడ్ల విక్రయానికి అడ్డుకట్ట వేయాలి



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిల పక్ష ఐక్యవేదిక నాయకులు

వనపర్తి: జిల్లా కేంద్రంలోని కొన్ని వెంచర్లలో మున్సిపాలిటీకి ఇచ్చిన పదిశాతం భూమిని, రోడ్లను ప్లాట్లుగా చూపి విక్రయిస్తున్న భూ దందాను అరికట్టాలని సబ్ రిజిస్ట్రార్ క్రిస్టఫర్‌కు బుధవారం అఖిల పక్ష ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ స్థలాన్ని, రోడ్లను ప్లాట్లుగా నమ్మించి అమాయకులను మోసం చేస్తూ.. సొమ్ము చేసుకునే వారికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దనే అడ్డుకట్ట పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గోపాల్‌పేట రోడ్డులోని డిగ్రీ కాలేజీ వద్ద రాఘవేంద్ర కాలనీ సీ బ్లాక్ వెంచర్‌ను ఇది వరకే లేవుట్‌చేసి ప్లాట్లు విక్రయించారు. కొద్ది రోజులకు యజమాన్యం దురాశతో వెంచర్‌లోని రోడ్లను సైతం ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కొంత కాలంగా జిల్లా కేంద్రంలో వెంచర్ దందాతో రెచ్చిపోతున్నారని, వారి బారి నుంచి అమాయకులను కాపాడాలని అఖిల పక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ కోరారు. కార్యక్రమంలో రాములు, సహదేవుడు, ప్రసాద్, మురారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులను ఆదుకోవాలి



ఆర్‌టీఓకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

పెబ్బేరు: రాష్ట్రంలో రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని రవాణా కార్మికులు బుధవారం ఆర్‌టీఓ కార్యాలయంలో ఎంవీఐ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఊషన్న, రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది రవాణా రంగంలో పనిచేస్తున్నారని, వీరిలో చదువుకున్న యువకులే ఎక్కువ శాతం ఉన్నారని, వారికి ఎలాంటి సంక్షేమ పథకాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురికాకుండా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. రవాణా కార్మికుల వాహనాలపై గ్రీన్ టాక్సీ, పెరిగిన ఫెనాల్టీలు, టోల్‌గేట్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ చార్జీలు తగ్గించి ప్రమాద బీమా సౌకర్యంతో రూ.10 లక్షలు, ఇంటి స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు, అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భీముడు, ఎండీ ముక్తర్, రాఘవేందర్‌గౌడ్, కమల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు

బిజినేపల్లి: మండలంలోని పాలెం చెందిన పెంటోని చెరువు నుంచి ఆయకట్టుకు సాగునీటిని బుధవారం ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ విడుదల చేశారు. పాలెం పెంటోని చెరువు నుంచి తూము తెరిచి పంట పొలాలకు పాటు కాల్వల ద్వారా నీళ్లు విడుదల చేశారు. ఈ చెరువు కింద దాదాపు వెయ్యి ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరు అందనుందని, వరి నాట్లకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లావణ్య, సుగుణమ్మ, నాయకులు రాములు, యాదవరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, స్వామి పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌ను వినియోగించుకోవాలి



చక్రాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజేందర్‌రెడ్డి

అడ్డాకుల: వరిసాగులో రైతులు డ్రమ్ సీడర్‌ను వినియోగిస్తే కూలీల ఖర్చును అధిగమించే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి అన్నారు. చక్రాపూర్ గ్రామంలో రైతు ప్రకాష్‌రెడ్డి వ్యవసాయ పొలంలో బుధవారం డ్రమ్ సీడర్ ద్వారా నాటు వేయడాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉండే డ్రమ్ సీడర్‌ను రైతులు రోజుకు రూ.250లు పంచాయతీకి చెల్లించి వాడుకోవచ్చని తెలిపారు. సాధారణ సాగులో ఎకరాకు 30 కిలోల విత్తనాలు అవసరమైతే డ్రమ్ సీడర్‌ను వినియోగిస్తే సన్నరకం విత్తనాలు 8 కిలోలు, దొడ్డు రకం విత్తనాలైతే 10–12 కిలోలో మాత్రమే అవసరమవుతాయని అన్నారు. శుద్ధి చేసిన విత్తనాన్ని 24 గంటల పాటు నీటిలో నానబెట్టి కొంత ముక్కు పగిలిన గింజలను తక్కువ నీళ్లు ఉండే బురద పదునులో డ్రమ్ సీడర్ ద్వారా చల్లాలని సూచించారు. 2,3 రోజుల పాటు నీరు పెట్టకుండా నిర్దిష్టమైన అంతరంలో సాళ్లు వస్తాయన్నారు. దీనివల్ల పురుగుల బెడద తగ్గడంతో పాటు అధిక పిలకలు వస్తాయని వివరించారు. సాధారణ సాగు కంటే ముందుగానే పంట కోతకు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు శివలీల, శివ, రైతులు ప్రకాష్‌రెడ్డి, సాయన్న, ప్రతాప్‌రెడ్డి, ఆంజనేయులు, జలంధర్, శ్రీనివాసులు, జగన్నాథ్‌రెడ్డి, బుడ్డన్న తదితరులు ఉన్నారు.